
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 16 ఏప్రిల్ 2025





ఏజెన్సీకి సాంత్వన
- భద్రాద్రి జిల్లాలో తీరిన వైద్యుల కొరత
- మారుమూల ప్రాంతాలకు విస్తరించిన వైద్యసేవలు
- అందుబాటులోకి స్పెషాలిటీ సేవలు

6

ఇక వేగంగా భూ సమస్యల పరిష్కారం

- ఆర్‌వోఆర్, మ్యుటేషన్‌లో నోటీస్‌లివ్వటానికి వెసులుబాటు
- లోపాలపై రైతులు అప్పీల్‌కు వెళ్లవచ్చు
- పైలట్ ప్రాజెక్టులో నేలకొండపల్లి ఉండటం రైతుల అదృష్టం
- నేలకొండపల్లి తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు



నేలకొండపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ధరణి-2020తో పోల్చుకున్నపుడు భూ భారతి-2025 రైతులకు ఎంతో ప్రయోజనకారిగా ఉందని నేలకొండపల్లి తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు చెప్పారు. పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వంత నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలాన్ని భూభారతి పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించిన నేపథ్యంలో తహసీల్దార్ మంగళవారం మధ్యాహ్నం (మిగతా 6వ పేజీలో)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా 'పసుమర్తి'

- స్వస్థలం దమ్మపేటలో హర్షాతిరేకాలు



దమ్మపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటకు చెందిన అటవీ శాఖ రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ పసుమర్తి మల్లికార్జునరావు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్యకలాపాల సలహాదారుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్లికార్జునరావు ఏపీలో అటవీశాఖ చీఫ్‌గా పనిచేస్తూ అక్కడే రిటైర్ అయ్యారు. ఆయన సేవలను ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం సలహాదారుగా నియమించింది. మల్లికార్జునరావు నియామకంపై దమ్మపేట మండల ఆర్యవైశ్యసంఘం నాయుకులు పసుమర్తి రాంభద్రం, పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షుడు దారా ప్రసాదు, వాసవీక్లబ్ అంతర్జాతీయ కోఆర్డినేటర్ మాజీ వైస్‌ఎంపీపీ దారా మల్లికార్జునరావు, జిల్లా ఆర్యవైశ్యసంఘం కార్యదర్శి దారా యుగంధర్, సాయిరాం, వెంకటేశ్వరరావు, ప్రదీప్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రగతి పాట.. ప్రజాబాట..

క్షేత్ర స్థాయికి వెళ్లనున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు

ప్రచారంలో వెనుకంజ..

త్వరలో పంచాయతీ, మండల, జిల్లాపరిషత్ సహకార ఎన్నికలు, మునిసిపల్ ఎన్నికలు వరుసగా రాబోతున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు దగ్గరకు కావాల్సిన విషయం కాంగ్రెస్ పార్టీ గుర్తించింది. ఉదాహరణకు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టినా ప్రారంభ కార్యక్రమాన్ని ఉత్సవంగా నిర్వహించలేకపోయింది. అధికారులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. దీంతో గతంలో ఎన్టీఆర్ రూ.2కిలో బియ్యం పంపిణీస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లలేక పోయారనే విమర్శ ఉంది. ఎమ్మెల్యేలు ఎక్కువగా హైదరాబాదులో ఉండడం, వర్గాలుగా తమ నేతల వెంట నడవడం తప్పా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విషయంలో కొందరిలో నిర్లక్ష్యంతో కనిపిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాల్లో చాలామంది ఉత్సాహంగా పాల్గొనకపోవడం కూడా పార్టీ అధిష్ఠానం గుర్తించింది. ఇప్పటికే సర్వేద్వారా ఎమ్మెల్యేల పనితీరుపై పీసీసీ, ఏఐసీసీ స్థాయిలో సర్వేలుండడంతో ఎమ్మెల్యేల పనితీరు, ప్రజలతో మమేకం, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రచారం పైనా భవిష్యత్ రాజకీయం ముడిపడనుంది.

ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. శాసనసభ్యులకు ఈ బాధ్యత అప్పగించింది. రాష్ట్ర అవతరణ వేడుకల్లోగా ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలతోపాటు కొత్తగా అమల్లోకి తెచ్చిన సన్నబియ్యం పంపిణీ, భూ భారతి, రాజీవ్ యువవికాసం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను కార్యక్రమాలను కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు నియోజకవర్గాల పర్యటనలపై పకడ్బందీ కార్యాచరణకు దిగే అవకాశం ఉంది.

- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రచారంపై ప్రత్యేక దృష్టి..
- సీఎల్పీ సమావేశంలో దిశానిర్దేశం చేసిన ముఖ్యమంత్రి
- ఆరు గ్యారంటీలతో పాటు, సన్నబియ్యం, భూ భారతిపై ఫోకస్
- ప్రజల్లో మైలేజీ సాధించడమే లక్ష్యం

ఖమ్మం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేల పనితీరుపైనా సీరియస్‌గానే మాట్లాడినట్లు పార్టీవర్గాల ప్రచారం. జిల్లాకు సంబంధించిన పది మంది ఎమ్మెల్యేల్లో మధిర నుంచి మల్లు భట్టి విక్రమార్క ఉపముఖ్యమంత్రిగా, ఆర్థికమంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఖమ్మంనుంచి గెలిచిన తుమ్మల నాగేశ్వరావు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళిశాఖ మంత్రిగా ఉన్నారు. పాలేరు నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రిగా ఉన్నారు. కాగా మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీపీఐనుంచి గెలిచారు. కాగా కాంగ్రెస్ నుంచి మంత్రులు మినహా మరో ఆరుగురు ఎమ్మెల్యేలు జిల్లాలో ఉన్నారు.

ప్రత్యేక కార్యాచరణ ఏదీ?

రాష్ట్రస్థాయిలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు బిజీగా ఉంటున్నారు. జిల్లాలో తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై దృష్టిపెట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వపరంగా ఎలాంటి ప్రత్యేక కార్యక్రమానికి కార్యాచరణ చేయడం లేదు. శంకుస్థాపనలు, సభలు, సమావేశాల తరుణంలోనే మాట్లాడుతూ వస్తున్నారు. ఏజెన్సీలోని ఎమ్మెల్యేలు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులుగా పొంగులేటితోనే భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో కార్యక్రమాలు సాగిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ శాఖ పరమైన కార్యక్రమాల తరుణంలోనే ఏజెన్సీలో పర్యటనలు సాగిస్తున్నారు. మంత్రి తుమ్మల ఖమ్మం నియోజకవర్గతో పాటు సత్తుపల్లి, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గంతో ఉన్న అనుబంధంతో భద్రాచలం నియోజకవర్గంలోను, కొత్తగూడెం నియోజకవర్గంలో పర్యటనలు సాగిస్తున్నారు. అయితే ప్రభుత్వ పథకాల ప్రచారం విషయంలో జిల్లాలో ఎమ్మెల్యేలు ఇకపై దృష్టిపెట్టి విస్తృతంగా ప్రచారానికి సన్నద్ధమవుతున్నారు.

రేపు మహిళలకు జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారి మాధవి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 17న (గురువారం) ఉదయం 10.00 గంటలకు ఖమ్మం గాంధీచౌక్‌లోని కోటక్ మహీంద్రా బ్యాంకుపై రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. 30-45 సంవత్సరాల వయస్సు కలిగి, డిగ్రీ పాసైన మహిళలు అర్హులని, ఎంపికైన వారికి వేతనం రూ. 20 వేల నుంచి రూ. 25 వేల వరకు ఉంటుందని, ఎంపికైన వారు ఖమ్మం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. మొత్తం 20 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, ఆసక్తికలిగిన వారు విద్యార్హతల సర్టిఫికెట్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని ఆమె కోరారు.

ప్రత్యేక అధికారుల నియామకం

- ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసంపై పర్యవేక్షణ

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా పర్యవేక్షణకు నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఇంచార్జ్ కలెక్టర్ పి.శ్రీజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం నియోజకవర్గానికి జడ్పీ సీఈవో దీక్షారైనా, పాలేరుకు ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, మధిరకు జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, వైరాకు డివిజనల్ పంచాయతీ అధికారి టి.రాంబాబు, సత్తుపల్లి నియోజకవర్గానికి ఎల్.రాజేంద్రగౌడ్‌ను ప్రత్యేక అధికారులుగా నియమించారు. దరఖాస్తుల సర్వే, వందశాతం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయనున్నారు. పథకాల గ్రౌండింగ్‌కు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ వారిని ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం మొద్దునిద్ర

- అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి
- పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేల పరిహారం అందించాలి
- బీఆర్‌ఎస్ నేత, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- పుల్లయ్యబంజర కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా



మహిళా రైతుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి) యాసంగిలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర పోతోందని బీఆర్ఎస్ నేత, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. కల్లూరు మండలంలోని పుల్లయ్యబంజర గ్రామంలోని ఐకేపి ధాన్యం కేంద్రాన్ని మంగళవారం రైతులతో కలిసి ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా నిర్వంచారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో కేంద్రాల్లో రైతుల ధాన్యం కొనుగోలులో జాప్యం జరగుతుందన్నారు. సకాలంలో ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయక పోవటంతో రైతులు పచ్చి ధాన్యంను బస్తాకు రూ.1200కు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందని చెప్పారు. ధాన్యం కేంద్రాలు ఇందిరమ్మ కమిటీల కాంగ్రెస్ నాయకుల అండదండలతో రాజకీయంగా నడుపుతున్నారని సండ్ర ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యం ధాన్యం, మామిడి రైతులకు శాపంగా మారిందన్నారు. ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు లేక రైతులు పడుతున్న ఇబ్బందులపై జిల్లా మంత్రులు, కలెక్టర్ స్థాయి అధికారి సందర్శించక పోవటం శోచనీయమని విమర్శించారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గన్నీ సంచులు కొరత, మిల్లర్లను ఒప్పించటంలో ప్రభుత్వం విఫలం కావటంతో నేడు ఈ పరిస్థితి ఏర్పడిందని సండ్ర అన్నారు. ఒక్క పుల్లయ్యబంజర కేంద్రంలోనే లక్ష బస్తాల ధాన్యం వర్షానికి తడిసిపోయిందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు వేగంగా జరిగేలా జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20 వేలు పరిహారం అందిచాలని కోరారు. ఈ సందర్భంగా ధాన్యం కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియపై వివరాలు అడిగి తెలసుకున్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, మాజీ జడ్పిటిసి కట్టా అజయ్‌కుమార్, నాయకులు లక్కినేని రఘు, కాటంనేని వెంకటేశ్వరరావు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బోబోలు లక్ష్మణరావు, యస్‌కె కమ్లి, పెడకంటి రామకృష్ణ, గంగవరపు వెంకటేశ్వరరావు, కళ్యాణపు కొండలరావు, కొరకొప్పు ప్రసాద్, పెద్దబోయన నారాయణరావు, సిహెచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి చింత

- సమ్మక్క బ్యారేజ్ నుంచి 300 క్యూసెక్కుల నీటి విడుదల
- మిషన్ భగీరథ మంచినీటి సరఫరాకు ధోకా లేనట్లే
- వారం రోజుల్లో దుమ్ముగూడెం చేరుకోనున్న గోదావరిజలాలు



అడుగంటుతున్న గోదావరి జలాలు

అశ్వాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తాగునీరు అందించే మిషన్‌భగీరథ మంచినీటి సరఫరాకు ఈ వేసవిలో ఎటువంటి డోకా లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా మంగళవారం ఎగువనున్న తుపాకుల గూడెం సమ్మక్క బ్యారేజ్ నుంచి 300 క్యూసెక్కుల నీటిని నీటిపారుదల శాఖాధికారులు దిగువకు విడుదల చేశారు. వారంరోజుల్లో దుమ్ముగూడెం ఆనకట్టను చేరుకోనున్నాయి. ప్రస్తుతం దుమ్ముగూడెం ఆనకట్టవద్ద గోదావరి జలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. ఈనేపథ్యంలో ఆనకట్ట సమీపంలో ఉన్న మిషన్‌భగీరథ ఇన్‌టెక్‌వెల్‌కు గోదావరి పాయ ద్వారా అధికారులు జలాలను సేకరిస్తున్నారు. ఆనకట్ట వద్ద 49మీటర్ల వరకు నీటి నిల్వఉంటే మిషన్‌భగీరథకు ఎటువంటి ఆటంకం ఉండదు. కాని ఆనకట్ట వద్ద ప్రస్తుతం 47.6 మీటర్ల నీరు నిల్వ ఉంది. దీంతో మే నాటికి నీటినిల్వలు మరింత తగ్గి మిషన్‌భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని గ్రహించిన అధికారులు ఎగువనుంచి నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు ఇటీవల లేఖ రాయటంతో అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో మిషన్ భగీరథ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కూలిన సీతారామ ప్రాజెక్టు సూపర్ పాసేజ్ పిల్లర్ (ఫైల్)

అయ్యో రామా.. 'సీతారామ'

- ప్రాజెక్టు పనుల్లో వెలుగుచూస్తున్న నాణ్యతా లోపాలు
- సూపర్ పాసేజ్ పిల్లర్ కూలిన ఘటనతో ఎన్నో ప్రశ్నలు
- అధికారుల గోప్యతపై ఎన్నో అనుమానాలు
- సీఎం సీరియస్ కావడంతో వెలుగులోకి వచ్చిన ఘటన

అశ్వారావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ములకలపల్లి మండలంలోని పూసుగూడెం-కమలాపురం మధ్య నిర్మించిన సూపర్ పాసేజ్ పిల్లర్ కూలిన సంఘటన... నిర్మాణ పనుల్లో డొల్లతనాన్ని తెలియజేస్తోంది. ప్రాజెక్టు ఆరంభం నుంచి నిర్మాణాల్లో వాడుతున్న ఇసుక, ఇతర మెటీరియల్ నాసిరకంగా ఉన్నాయని, పర్యవేక్షణ గాలికి వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. అయితే వీటన్నింటిని అధికారులు కొట్టి పారేస్తూ వచ్చారు. తీరా కొద్దిరోజుల పాటు ట్రయల్ రన్ వేసిన సమయంలో పిల్లర్ నిలువునా కూలిపోవడంతో ప్రాజెక్టు నిర్మాణపు పనుల్లో నాణ్యత ప్రశ్నార్థంగా మారింది. పాసేజ్ పిల్లర్ కూలి నెల కావస్తున్నప్పటికీ, ఫొటోలతో సహా ముఖ్యమంత్రి వద్దకు ఫిర్యాదులు వెళ్లేంత వరకు అధికారులు స్పందించలేదు. ప్రభుత్వంలో, నీటిపారుదల శాఖలో ప్రాజెక్టులు నిర్మాణాలు, పర్యవేక్షణ, నాణ్యత పరిశీలన, విజిలెన్స్ వంటి ఎన్నో వ్యవస్థలు ఉంటాయి. ఇంత జరుగుతున్నా ఈ వ్యవస్థలు ఇప్పటి వరకు ఏమి చేస్తున్నట్లో అర్థం కావడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలనే బృహత్తర ఆశయాల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మిస్తున్న సీతారామ (మిగతా 6వ పేజీలో)

ఫటాఫట్



రాజీవ్ యువ వికాసానికి మంచి స్పందన

గుడిపూడి సుజాతరాణి, మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్

ప్రశ్న: రాజీవ్ వికాసం పథకానికి దరఖాస్తులు ఎలా వచ్చాయి?

జ: మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరించాం. 9రోజులు పాటుగా దరఖాస్తులు స్వీకరించగా మంచి స్పందన వచ్చింది. దరఖాస్తులు ఇచ్చిన వారికి రశీదులు ఇచ్చాం. దరఖాస్తుల స్వీకరణకు నగర పాలక సంస్థ కార్యాలయంలో రెండు కౌంటర్లను ఏర్పాటు చేశాం.

ప్ర: నిరుద్యోగులు ఎంతమంది దరఖాస్తు చేశారు?

జ: ఈనెల 3 నుంచి 14వ తేదీ వరకు ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను నగర పాలక సంస్థ కార్యాలయంలో(కేఎంసీ) స్వీకరించాం. తుది గడువు ముగిసే వరకు మొత్తం 19,138 దరఖాస్తులు అందాయి. వాటిలో 40 దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో తీసుకొని ఆన్‌లైన్ చేశాం. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో 2,155 దరఖాస్తులు, ఎస్టీ 583, బీసీ 4,793 ఓసీ 516, మైనార్టీ 1,992, క్రిష్టియన్ మైనార్టీ 15, దివ్యాంగ అభ్యర్థులు 44మంది దరఖాస్తులు చేశారు.

ప్ర: తుది గడువు నాటికి దరఖాస్తులు ఇవ్వలేని వారికి అవకాశం ఉందా?

జ: ఈనెల 14తో తుది గడువు ముగిసింది. ఆన్‌లైన్ జరిగిన దరఖాస్తులను 15వ తేదీన కూడా స్వీకరించాం. ఇంకా ఎవరైనా ఆన్‌లైన్ చేసి ఉండి నేరుగా దరఖాస్తులు ఇవ్వలేని వారు ఉంటే బుధవారం ఖమ్మం నగరంలోని మెప్మా కార్యాలయంలో ఇవ్వొచ్చు.

- ఖమ్మం సంక్షేమ విభాగం

ఏజెన్సీకి సాంత్వన



చికిత్స పొందుతున్న చిన్నారులతో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ (ఫైల్)

- భద్రాద్రి జిల్లాలో తీరిన వైద్యుల కొరత..
- మారుమూల ప్రాంతాలకు విస్తరించిన స్పెషాలిటీవైద్యసేవలు
- పెరిగిన ప్రసవాలు, ఇతర స్పెషాలిటి సేవలు
- తీరిన డయాలసిస్ రోగుల పాట్లు
- వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు
- వేసవి దృష్ట్యా రోగులకు ప్రత్యేక వసతులు

కొత్తగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అధికారుల సమన్వయంతో వైద్య ఆరోగ్య శాఖపై ప్రత్యేక శ్రద్ధ చూపి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తూ జిల్లాలోని గిరిజన, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. జిల్లాలో గత సంవత్సరంలో ముఖ్యమంత్రి, మంత్రుల ఆదేశాల మేరకు వైద్యంపై శ్రద్ధపెట్టి అధికారులు కొత్త మెరుగులు దిద్దుతున్నారు.

గతంలో డయాలసిస్ రోగుల వారి వైద్యం కోసం నెలలు కొద్ది వేసి చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఒకరు చనిపోతే తప్ప మరొకరికి స్లాట్ దొరికే పరిస్థితి ఉండక పోయేది. అలాంటిది నేడు సుమారు 53 మిషన్లతో 248 మంది సేవలు పొందుతూ 170 ఖాళీలు ఉన్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట, భద్రాచలం, చర్ల వంటి మారుమూల ప్రాంతంలో డయాలసిస్ సెంటరు ఏర్పాటుచేయడం వల్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో స్వల్పకాలంలో డయాలసిస్ సెంటరుఏర్పాటు చేయడం పట్ల కిడ్నీ రోగుల బాధ తప్పినట్లయింది. చర్ల లాంటి మారుమూల గిరిజన ప్రాంతంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేయడం అనేది గిరిజనులకు వైద్యసేవలు చేరువ చేయడంలో కలెక్టర్ చిత్తశుద్ధికి నిదర్శనం.

ఫిజియోథెరపీ సేవలు..

ఇల్లెందులో ఫిజియోథెరపీ చికిత్స కొరకు రోగులు తమ సొంత ఖర్చులతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించేవారు. ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ ఉన్నప్పటికీ పరికరాలు లేవని డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు ద్వారా తెలుసుకున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కలెక్టర్‌తో మాట్లాడి జిల్లాస్థాయి నిధులతో రెండున్నర లక్షలతో ఫిజియోథెరపీ పరికరాలు మంజూరు అయ్యేలా చూశారు. తద్వారా ఇల్లెందులో రోజుకు 15మంది రోగులు ఫిజియోథెరపీ సేవలు పొందుతున్నారు. దీంతో వారికి ఆర్థిక వెసులుబాటుతో పాటు దూరాభారం తగ్గింది.

వైద్య సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

ఎప్పటికప్పుడు సమస్యలను తమ దృష్టికి తీసుకు వచ్చి ప్రణాళికాబద్ధంగా పరిష్కారాల కోసం కృషి చేస్తున్న సమన్వయ అధికారి డాక్టర్ జి. రవిబాబు, వివిధ ఆసుపత్రి సూపరింటెండెంట్, అంకిత భావంతో మారుమూల ప్రాంతంలోపని చేస్తున్న వైద్య సిబ్బందిని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అభినందించారు. వైద్య సిబ్బంది మరింత బాధ్యతలతో సేవలు కొనసాగించాలని వారు కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో తీరిన మందులకొరత..

విషజ్వరాలు జిల్లాలో విపరీతంగా విజృంభిస్తున్న వేళ కలెక్టర్ జిల్లా మంత్రుల సమన్వయంతో మందులు, రక్త పరీక్షల కొరకు కావాల్సిన రీఏజెంట్స్ కొరకు సుమారు రూ.90లక్షలు మంజూరు చేసి కొరత తీర్చారు. తద్వార రోగులపై ఆర్థిక భారం పడకుండా చేశారు. లేకుంటే రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఇల్లెందులో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణం పూర్తి అయితే బొగ్గుట్టలో మరింత మందికి పూర్తిస్థాయి వైద్యం అందనుంది. త్వరలో అశ్వారావుపేట, బూర్గంపాడు, చర్ల ఆసుపత్రుల భవంతుల శంకుస్థాపనలు జరగనున్నాయి. జిల్లాలో ఎండలు మండిపోతున్న వేళ రోగులకు ఇబ్బంది కలగకుండ అన్ని ఆసుపత్రుల్లో తాగునీటి కొరకు ఆర్‌వో వాటర్‌ప్లాంట్, కూల్‌వాటర్ ఫ్రీజ్‌లు, కారిడార్లలో సరిపడ ఫ్యాన్లు, వార్డుల్లో కూలర్లు, ఆపరేషన్ వార్డుల్లో ఏసీలు ఏర్పాటుచేసి రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ప్రణాళికతో ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకందాలి

- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ వేగిరం చేయాలి
- వేసవిలో తాగునీటి ఇబ్బందులు రావొద్దు
- రెవెన్యూ సదస్సులకు కార్యాచరణ రూపొందించాలి
- అధికారులతో ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల లబ్ధిని అర్హులకు అందేలా కార్యాచరణ అమలుచేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పి. శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, భూ భారతిపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా చిన్న తరహా పరిశ్రమలు లేదా యూనిట్ల ఏర్పాటుకు యువతకు సబ్సిడీతో 4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 29,091, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 14,220, బీసీ కార్పొరేషన్ ద్వారా 41,881, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 6,658 దరఖాస్తులు, మొత్తంగా 91,850 దరఖాస్తులు సోమవారం నాటికి అందినట్లు, అన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు అర్హులై, ప్లాట్లు ఉండి ఎల్1 జాబితాను ఎంపీడీవో సంతకంతో తీసుకొని, ఆమోదం కోసం ఇందిరమ్మ కమిటీ ముందు ఉంచాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదం తర్వాత మండల ప్రత్యేక అధికారి ఆయా జాబితాను జిల్లా ఇంచార్జ్ మంత్రి ఆమోదం కోసం పంపించాలన్నారు.

వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటికి ఎక్కడా సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గాల వారిగా కావాల్సిన పనుల విషయమై నివేదిక సమర్పించాలన్నారు. ఇంట్రా, గ్రిడ్‌లకు బఫర్‌లు పెట్టాలన్నారు. కొత్తగా కాలనీలు, హాబీటేషన్‌లు ఏర్పడ్డ చోట పైప్ లైన్ పొడిగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర తాగునీటి అవసరాల కోసం కలెక్టర్ నిధుల మంజూరుకు పనుల గుర్తింపు వెంటనే చేపట్టాలన్నారు.

భూభారతి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. భూ భారతి అమలు విషయమై పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేశారని తెలిపారు. మండల హెడ్ క్వార్టర్స్‌లో భూ భారతి చట్ట అమలుపై అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ఏర్పాటుకు షెడ్యూల్ రూపొందించాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల విజయవంతానికి తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో లబ్ధిదారుల సమీకరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



సీఎంను కలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే

సత్తుపల్లి, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయాలని కోరారు. మండలంలోని కిష్టారంలోని అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ వాసులు సైలోబంకర్ కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలు వివరించగా సానుకూలంగా స్పందించిన సీఎం పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఉన్నారు.

ఇక వేగంగా

భూ సమస్యల పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

విలేకరులతో మాట్లాడారు. ధరణికి-భూభారతికి ఎన్నో వ్యత్యాసాలున్నాయని, ధరణిలో మొత్తం 33 మాడ్యూల్స్ ఉంటే భూభారతిలో ఆరు మాడ్యూల్స్ మాత్రమే ఉన్నాయన్నారు. దీంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చే రైతులకు రిజిస్ట్రేషన్ త్వరగా అవ్వటానికి అవకాశం ఉంటుందన్నారు. ధరణి చట్టంలో ఆర్‌ఎస్‌ఆర్, మ్యుటేషన్‌లలో ఎటువంటి లోపాలున్నప్పటికీ కోర్టును ఆశ్రయించటం తప్ప వేరే మార్గం లేదని, భూభారతిలో వారం రోజుల సమయం ఇస్తూ నోటీస్‌లిచ్చి పిలిచి సరిచేసే అవకాశం, వెసులుబాటు ఉన్నాయన్నారు. గతంలో పొరపాట్లు జరిగితే పిలిస్తే చాలా మంది రైతులు ఇష్టమైతే వచ్చేవారు లేకపోతే వచ్చేవారు కాదన్నారు.

భూభారతి చట్టం ద్వారా నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా రావాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా, పారదర్శకంగా ఉంటుందన్నారు. అంతే గాకుండా ఎంతో కాలంగా రైతులు ఎదురు చూస్తున్న పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారానికి భూభారతి చట్టంలో అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ చెప్పారు. 02.06.2014వరకు కొనుగోలు చేసిన భూములకు సాదాబైనామా ద్వారా చేసుకోమని గతంలో 12.10.2020 నుంచి 10.11.2020 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారని, అటువంటి దరఖాస్తులు మండలంలో 3,417 ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు.ప్రస్తుతం భూభారతి చట్టం ద్వారా వాటికి మోక్షం లభించే అవకాశాలున్నాయని తహసీల్దార్ వెంకటేశ్వర్లు చెప్పారు.

గతంలో భూసమస్యల పరిష్కారం అంతా కలెక్టర్ దగ్గర ఉండేదని, కొత్తగా అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం ద్వారా రూ. 5లక్షల లోపు విలువ ఉన్న భూములకు సంబంధించి ఆర్డీఓ వద్ద తేల్చుకోవచ్చని, రూ.5లక్షల పై విలువ ఉన్న భూతగాదాలు కలెక్టర్ పరిధిలో ఉంటాయన్నారు. ధరణిలో ఉన్న సమస్యలన్నీ భూభారతి చట్టం ద్వారా పోతాయని అందుకే ప్రభుత్వం రైతులకు ఉపయోగకరంగా ఉండే విధంగా భూభారతి చట్టాన్ని రూపొందించినట్లు తహసీల్దార్ చెప్పారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, రైతులకున్న భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించనున్నట్లు చెప్పారు. భూభారతి చట్టం అమలుకు రాష్ట్రంలో ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో నేలకొండపల్లి ఉండటం రైతుల అదృష్టమన్నారు.

పశువుల దాహార్తి తీరేదెలా?

జూలూరుపాడు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా దర్శమిస్తున్నాయి. లక్షలాది రూపాయల నిధులతో నిర్మించిన నీటితొట్టెలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని పడమటనర్సాపురం, మాచినేనిపేట, గురవాగుతండా, కాకర్ల, అనంతారం, వినోబానగర్ తదితర గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా గతంలో వీటిని ఏర్పాటుచేశారు. పశువులు తాగేందుకు తొట్టెల్లో నీటిని నింపే బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు. కాగా వీటి నిర్వహణను పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడంలేదు. దీంతో కొన్ని గ్రామాలలో నీటి తొట్టెలు ధ్వంసం కాగా మరి కొన్ని గ్రామాలలో నిరుపయోగంగా మారాయి. వేసవిలో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని తొట్లలో నీటిని నింపి పశువులకు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.



మాచినేనిపేటలో నీళ్లు లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్న నీటితొట్టి

అయ్యో రామా.. 'సీతారామ'

(5వ పేజీ తరువాయి)

ప్రాజెక్టు పనుల్లో కాంట్రాక్టు సంస్థలు చెప్పిందే వేదం అనేలా పనులు జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణపైన పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ట్రయల్ రన్ సమయంలోనే పిల్లర్ నిలువునా కూలి పోయింది. ఎన్నో పరీక్షల అనంతరం నిపుణులైన ఇంజనీర్లు డిజైన్ ప్రకారం నిర్మించిన ఈ పనులు ఆరంభంలోనే కూలిపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ప్రాజెక్టు పూర్తయి నిరంతరం నీళ్ల సరఫరా చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే నాసిరకంగా పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపై లోతుగా విచారణ జరిపి వ్యవస్థలు అప్రమత్తం కాకపోతే భవిష్యత్‌లో మరిన్ని నష్టాలు తప్పవు. రూ.వందల కోట్లు ప్రజా ధనం వృథా అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఇదిలా ఉంటే వేల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న సీతారామప్రాజెక్టు అస్తిత్వానికి ముప్పు వాటిల్లేలా నాసిరకం నిర్మాణాలు జరిగి, పిల్లర్ కూలి పోయిన ఘటనపై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఇతరత్రా సంఘాలు ఏ ఒక్కరూ నోరు మెదపక పోవడం కూడా ఆశ్చర్యం కలిగిస్తోంది. పిల్లర్ కూలి పోయిన సంఘటన వెలుగులోకి వచ్చినప్పటికీ ఇటు అధికారులు, అటు నిర్మాణపు సంస్థలు అందరూ మిన్నకుండి పోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. పిల్లర్ కూలిన దాని స్థానంలో మరలా కొత్త పిల్లర్ నిర్మిస్తామని చెబుతున్న అధికారులు, పిల్లర్ కూలడానికి కారణాలు, మిగతా వంతెన నాణ్యత, ఇతర పనుల్లో నాణ్యత ఎలా ఉందనే దానిపై విశ్లేషించడానికి సాహసించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పంచాయతీ కార్యదర్శిపై దాడికి యత్నం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన శ్రీనివాసరావు
- కేసు నమోదు

భద్రాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని చర్ల రోడ్‌లో గిరిజన గురుకుల బాలికల పాఠశాల వద్ద మోరీలో పారిశుధ్య పనులు చేస్తున్న సమయంలో భద్రాచలం గ్రామపంచాయతీ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్‌రావుపై స్థానిక హోటల్ యజమాని దాడికి యత్నించాడు. మోరీలో పారిశుధ్య పనులు చేపడుతున్న క్రమంలో ఘర్షణ చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో మురుగునీరు రహదారిపైకి చేరుతోందని పాఠశాల ప్రిన్సిపాల్ ఐటీడీఏ పీవో బి.రాహుల్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఉన్న ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశాలమేరకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని మోరీలో చెత్తాచెదారం పేరుకుపోవటంతో మురుగునీరు బయటకు వస్తోందని గుర్తించి పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సమయంలో హఠాత్తుగా అక్కడ హోటల్ నిర్వహిస్తున్న వ్యక్తి పనిచేస్తున్న సిబ్బందిపై దాడిచేసి అనంతరం కార్యదర్శి శ్రీనివాసరావుపై కుర్చీతో దాడికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పంచాయతీ సిబ్బంది స్థానికులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు.

పంచాయతీ సిబ్బందిపై దాడితోపాటు తనపై దాడికి యత్నించిన వ్యక్తిపై కార్యదర్శి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ స్వప్న కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా గ్రామపంచాయతీ కార్యదర్శిపై భౌతికదాడికి పాల్పడటం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

అకాల వర్షంతో మక్కరైతుల ఆగమాగం



పట్టాలు కప్పుతున్న రైతులు

బోనకల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పంట సక్రమంగా పండినా, తమ వద్ద నుంచి వ్యాపారులకు అమ్మేంత వరకూ రైతులు నిద్ర లేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం కురిసిన అకాల వర్షంతో మక్క రైతులు ఆగమాగం కాగా తాజాగా మారిన వాతావరణ పరిస్థితులతో కల్లాలకు పరిమితమయ్యారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులంతా కల్లాల బాట పట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు పిల్లల నుంచి పెద్దల వరకు గింజలను ఆరబోయడం, వాటిని పోగేసే పనుల్లో తలమునకలై ఉన్నారు. మక్కలను ఆరబోసిన కల్లాల్లో నీళ్లు పారడంతో వాటిని ఆరబెట్టుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. గింజలు ఏమాత్రం తడిచినా రంగు మారే అవకాశం ఉండటంతో కల్లాల్లో తడి లేకుండా చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ఏడాది మక్క పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిషన్లతో పట్టించడం, కల్లాలకు తరలించి అమ్మకాలు చేశారు. కాని గత నాలుగు రోజులుగా గాలి దుమారం, అకాల వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

గాలి దుమారానికి కొందరి రైతుల మక్క పంట నేల మట్టమైంది. దీంతో రైతులకు కంకులు విరిపించడానికి అధికంగా ఖర్చు వస్తుంది. మిషన్ ద్వారా ఎకరానికి రూ. 4వేలతో గింజలు ఇంటికి వస్తాయి. కాని గాలికి నేలకొరిగిన పంటను మిషన్ ద్వార పట్టడం సాధ్యం కాదు. దీంతో కూలీలతో విరిపించాల్సి వస్తుంది. ఎకరానికి కూలీలతో విరిపిస్తే రూ.10వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్టాన్ని కలిగించిందని వాపోతున్నారు.

ఐదు ఎకరాల్లో మక్క పంట నేల మట్టమైంది

● గంగుల నాగేశ్వరరావు, రైతు, బోనకల్

ఏడు ఎకరాల్లో మక్క పంటను సాగు చేశాను. గాలి దుమారం వలన 5 ఎకరాల్లో పంట నేలమట్టమైంది. కూలీలతో విరిపించడానికి ఖర్చు ఎక్కువగా వస్తుంది. గాలి దుమారం లేకపోతే మిషన్ ద్వారా తక్కువ ఖర్చుతో గింజలు ఇంటికి వచ్చేవి. అలా జరగనందున్న అధిక భారం పడుతుంది.

రెండు ఎకరాలు నష్టపోయా...

● గద్దె నాగరాజు, రైతు, బోనకల్

రెండు ఎకరాల్లో మక్క పంటను సాగు చేశాను. గాలి దుమారం వలన వేసిన రెండు ఎకరాల్లో పంట నేల మట్టమైంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. కింద పడిన మక్కలను విరిపించడానికి కూలీలు ఎక్కువ డబ్బులు అడుగుతున్నారు. కాలం బాగుందని అనుకుంటే చివర్లో గాలి దుమారం నష్టాన్ని మిగిల్చింది.

ఇందిరమ్మ ఇల్లు చెక్కు అందుకున్న నీలిమ



సీఎం చేతుల మీదుగా చెక్కును అందుకున్న లబ్ధిదారుల్లో వైరా ఎమ్మెల్యే కుడివైపు ఉన్న లబ్ధిదారురాలు నీలిమ

కొణిజర్ల,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఇందిరమ్మ ఇండ్లు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేతులు మీదగా ఇందిరమ్మ ఇండ్లు మొదట దశ పూర్తి చేసిన వారిలో కొణిజర్ల మండలం చిన్నగోపతి గ్రామానికి చెందిన లింగాల నీలిమ లక్ష రూపాయల చెక్కును వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి అందుకుంది. మండలంలో చిన్నగోపతి గ్రామంను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. జిల్లా నుంచి సీఎం చేతులు మీదగా చెక్కులు అందుకునే వారిలో ఇద్దరు ఉన్నారు. వారిలో కొణిజర్ల మండలానికి కూడ అవకాశం వచ్చింది. చిన్నగోపతి గ్రామానికి చెందిన నీలిమ ను కూడ హైదరాబాద్ తీసుకెళ్లి చెక్కును అందజేశారు. సీఎం చేతులు మీదగా చెక్కు అందుకోవడం ఆనందంగా ఉందని లబ్దిదారురాలు తెలిపింది. చిన్నగోపతి గ్రామంలో మొత్తం 52 ఇండ్లు మంజూరు అయ్యాయి. వారిలో 37 మంది ఇండ్లు కట్టడం ప్రారంభించారు.

ఈ నెల 28 నుంచి

భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

కల్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం 2025 పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ఈ నెల 28 నుంచి 30 తేది వరకు కల్లూరు డివిజన్ పరిధిలో సదస్సులు నిర్వహించనున్నట్లు ఆర్డీవో ఎల్ రాజేంద్రగౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నూతనంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రికార్డ్స్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్ భూభారతి చట్టంపై ఈ నెల 28 న సత్తుపల్లి, వేంసూరులో, 29 న కల్లూరు, పెనుబల్లిలో, 30 న తల్లాడ మండల కేంద్రంలో రైతులు, ప్రజలను ఆహ్వానించి అవగాహన సదస్సులు నిర్వహించటం జరగుతుందని ఆయన తెలిపారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రతిష్టాత్మకంగా తీసుకొవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆ క్రమంలోనే మండల కేంద్రాల్లో అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకొని తహసీల్దార్లు ఈ సదస్సులను ఏర్పాటు చేస్తూ నూతన భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఆర్డీఓ వివరించారు.

రేషన్‌లో ప్లాస్టిక్ బియ్యం సరఫరా

అనే ప్రచారం అవాస్తవం

- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో పంపిణీ చేసే సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె.చందన్ కుమార్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకు గురిచేసి, సమాజంలో అశాంతి సృష్టించాలనే దురుద్దేశంతో కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలను భయాందోళనలకు గురి చేస్తూ, తప్పుడు వీడియోలను సామాజిక మాధ్యాలలో ప్రచారం చేస్తే వారిపైన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి హెచ్చరించారు.

చేపల పెంపకంతో లాభాలు..

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సిరులు పండించే కొర్రమీను చేపల పెంపకం ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులకు, వ్యవసాయశాఖ ఏపీఎంలకు కొర్రమీను చేపల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం అన్ని సమయాల్లో కలిసి వస్తుందని గ్యారంటీ లేదన్నారు. దీంతోపాటు ఇంట్లో ఉన్న మహిళలు, మగవాళ్ల అందరు, వ్యవసాయ కూలీలు నిరంతరం కష్టపడాల్సి వస్తోందని పేర్కొన్నారు. కాబట్టి ఒక్కసారి పెట్టుబడితో నిరంతరం ఆదాయం వచ్చే చేపల పెంపకంపైన రైతులు దృష్టి సారించాలని ఆయన తెలిపారు. కొర్రమీను చేపల పెంపకం కోసం ఎక్కువ ప్రదేశం కూడా అవసరం లేదన్నారు. ఒక్క చేప పిల్ల ఖరీదు రూ.15లు కాగా 1000 చేపల పిల్లల పెంపకం చేపట్టి అందులో 100 చేప పిల్లలు చనిపోయిన 900 చేప పిల్లలు మీ చేతికి వస్తే కిలో సుమారు రూ.300లకు అమ్మిన రూ.2,70,000లు కేవలం ఏడు నెలల్లో చేతికి వస్తుందని తెలిపారు. కొర్రమీను చేపల పెంపకం యూనిట్ స్థాపన కోసం బ్యాంకుల ద్వారా పీఎం ఈజీపీ పథకం ద్వారా 35శాతం సబ్సిడీ వస్తుందని, చేపల పెంపకానికి కావాల్సిన ఫామ్‌పాండ్ నిర్మాణం ఉపాధిహామీ పథకం ద్వారా ఉచితంగా నిర్మించవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని రైతులు మహిళా సమైఖ్య సభ్యులు ముందడుగు వేసి కొర్రమీను చేపల పెంపకం చేపట్టి రాష్ట్రానికి చేపల పెంపకంలో మన జిల్లా ఆదర్శంగా నిలపాలన్నారు. అనంతరం జిల్లాలో ప్రయోగాత్మకంగా అశ్వాపురం, సుజాతనగర్‌లో స్థాపించి కొర్రమీను చేపల పెంపకంలో విజయం సాధించిన రైతులు దుర్గా ప్రసాద్, జంపన్న వారు చేపడుతున్న చేపల పెంపకంలో వారి అనుభవాలను అందరితో పంచుకున్నారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, వ్యవసాయశాఖాధికారి బాబురావు, లీడ్ బ్యాంకు మేనేజరు రాంరెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజరు తిరుపతయ్య, మత్స్యశాఖ ఎండీ. ఇంతియాజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సబ్సిడీ డబ్బులు ఏవీ..?

- » మూడేళ్లుగా నిరీక్షిస్తున్న చేపల చెరువుల రైతులు
- » పీఎంఎంఎస్‌వై కింద చెరువుల నిర్మాణం
- » మత్స్యశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు


తమ పొలాల్లో రైతులు తవ్వుకున్న చేపల చెరువు

వైరా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని పలువురు రైతులు తమ భూముల్లో చేపల చెరువులు తవ్వుకొని ప్రభుత్వం నుంచి రావల్సిన సబ్సిడీ సొమ్ము కోసం మూడు సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్నారు. 2022 నుంచి జిల్లాలో దాదాపు 57మంది రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కోసం హైదరాబాద్‌లోని రాష్ట్ర మత్స్యశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అక్కడి ఒకరిద్దరు ఉన్నతాధికారులు ఈ సబ్సిడీ విడుదల చేసే విషయంలో తమను ఇబ్బందిపెడుతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద చేపల చెరువుల నిర్మాణాన్ని 2022లో జిల్లాలోని 57మంది రైతులు చేపట్టారు. తమ భూముల్లో చేపల చెరువులు నిర్మించుకు న్న రైతులకు సబ్సిడీ మంజూరు కోసం 2022 లో ఖమ్మంజిల్లా మత్స్యశాఖ నుంచి రాష్ట్ర మ త్స్యశాఖ కార్యాలయానికి ప్రతిపాదనలు వెళ్లాయి.

జిల్లాస్థాయి కమిటీ(డీఎల్‌సీ) ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్, జిల్లా మత్స్య, వ్యవసాయ, నీటి పారుదల, జలవనరులశాఖ అధికారులు సభ్యులుగా ఈ కమిటీ పనిచేస్తుంది. కమిటీ ఈ చేపల చెరువుల నిర్మాణాలను పరిశీలించి కలెక్టర్ అనుమతితో సబ్సిడీ మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర మత్స్యశాఖ కార్యాలయంలో ఈ సబ్సిడీకి సంబంధించి కమిషనర్ పాలనాపరమైన మంజూరు ఇవ్వాల్సి ఉంది. రైతులు చెరువు తవ్విన తర్వాత మెదర్‌మెంట్ బుక్(ఎంబీ) చేసి బిల్లుల సబ్సిడీ కోసం కలెక్టర్ అనుమతితో పంపించినప్పటికీ మూడేళ్లుగా రాయితీ రాలేదు.

సబ్సిడీ విధానం...

పీఎంఎంఎస్‌వై పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించింది. నిధులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. మత్స్య సంపదను పెంచేందుకు గానూ సన్నచిన్నకారు రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టింది. ఓసీల్లో ఒక హెక్టారును ఒక యూనిట్‌గా నిర్ణయించారు. యూనిట్ ఖర్చు రూ.11లక్షలు. వీటిలో 40శాతం సబ్సిడీ కింద రైతులకు రూ.4.40లక్షలు చెల్లిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అయితే 60శాతం సబ్సిడీని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం ఈ కేటగిరీలో హెక్టారుకు ఒక యూనిట్‌కు రూ.6.60లక్షలు సబ్సిడీని కేంద్రం చెల్లిస్తుంది. ఏ రైతుకైనా రెండు యూనిట్లకు మించి అనుమతి ఉండదు. ఐదెకరాలున్న రైతు రెండున్నర ఎకరాలు(ఒక హెక్టారు)చొప్పున రెండు యూనిట్లుగా చేపల చెరువు నిర్మించుకునే వెసులుబాటు ఉంది. రెండు యూనిట్లు ఉన్న ఓసీ రైతులకైతే రూ.8.80లక్షలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అయితే రెండు యూనిట్లకు 13.20లక్షలు సబ్సిడీని కేంద్రం చెల్లిస్తుంది.

కొనసాగుతున్న వివక్ష

2022లోనే 57మంది రైతులకు చెందిన చెరువుల నిర్మాణం జరిగింది. ఆచెరువులకు సంబంధించి సబ్సిడీ కోసం జిల్లా కలెక్టర్ అనుమతితో మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఇప్పటివరకు కేవలం ముగ్గురు రైతులకు మాత్రమే సబ్సిడీ విడుదల కోసం పాలనాపరమైన మంజూరు వచ్చిం ది. దానికి సంబంధించి ఎంబీ బిల్లులు పంపించారు. వారికి సబ్సిడీ విడుదల అయింది. ఇంకా మిగిలిన 54మంది రైతులకు ఎలాంటి సబ్సిడీ విడుదల కాలేదు.

ఘనంగా రామయ్య కల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయ ఆవరణలో ఉన్న దాసాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం అంజనేయస్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

ఉరి వేసుకొని వ్యక్తి బలవన్మరణం

ఆళ్లపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) ఉరివేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆళ్లపల్లి మండలంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆళ్లపల్లి మండలం రాయిపాడు పంచాయతీ, మూత్తాపురం గ్రామానికి చెందిన బాబు(46) మంగళవారం ఉదయం ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్ర లేవగానే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు కనిపించాడు. కాగా బాబు కాలు విరిగి కొంత కాలంగా బాధపడుతున్నాడని గ్రామస్థులు తెలిపారు. ఎనిమిది నెలల క్రితం బాబు భార్య మృతి చెందగా, ఇప్పుడు బాబు మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాబు ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

నాచేపల్లిలో విద్యార్థి....


యశ్వంత్(ఫైల్)

నేలకొండపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాచేపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ యశ్వంత్(19)అనే విద్యార్థి మంగళవారం మధ్యాహ్నం నేలకొండపల్లిలోని బౌద్ధస్తూపం సమీపంలో ఓచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. ఏసీ మెకానిక్ నేర్చుకుంటానని, ఇటీవల కొంతకాలంగా ఖమ్మం వెళుతున్నట్లుగా తెలుస్తున్నది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పట్టుబడిన టేకు దర్వాజాపై కేసు నమోదు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీరేంజి పరిధి చిననల్లబల్లి వద్ద ఈనెల 12న రాత్రి సమయంలో టేకు దర్వాజాను ట్రాక్టరుపై అక్రమంగా తరలిస్తూ అటవీశాఖ సిబ్బందికి పట్టుబడిన విషయం తెలిసిందే. కాగా పట్టుబడిన కలప ట్రాక్టరును దుమ్ముగూడెం అటవీరేంజి కార్యాలయానికి తరలించి మూడురోజులైనా పీవోఆర్ ఇష్యూ చేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ ఈనెల 15న ఆంధ్రజ్యోతిలో పట్టుబడిన కలప ట్రాక్టర్‌ను వదిలేస్తారా అనే కథనం వెలువడింది. స్పందించిన అధికారులు ఎట్టకేలకు మంగళవారం పీఓఆర్ ఇష్యూ చేశారు. దర్వాజాకు ఒన్‌టైం జరిమానా రూ.28,184లను విధించడంతో పాటు మంగళవారం ట్రాక్టరును భద్రాచలం కలప డిపోకు తరలించారు.

టేకు దిమ్మెల పట్టివేత


పట్టుబడిన టేకు దిమ్మెలు

దుమ్ముగూడెం ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీరేంజి పరిధి చింతగుప్ప పరిసర ప్రాంతం జిన్నెలగూడెం బీటులో అక్రమ రవాణాకు సిద్ధంగా దాచి ఉంచిన 14 టేకు దిమ్మెలను అటవీశాఖ సిబ్బంది మంగళవా రం దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన టేకు కలపను భద్రాచలం డిపోకు తరలించారు. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని సమాచారం. దాడుల్లో రేంజి అధికారి కమల, ఎఫ్‌బీఓలు, జిన్నెలగూడెం, డికొత్తూరు బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఫోను లో పలుమార్లు ప్రయత్నించగా, రేంజి అధికారి అందుబాటులోకి రాలేదు. వివరాలను గోప్యంగా ఉంచడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ యువజన సంఘం పేరిట గోవిందాపురం, పెదబండిరేవు, చిననల్లబల్లి, ములకపాడు, లక్ష్మీనగరం, నడికుడి ప్రాంతాల్లో మంగళవారం పోస్టర్లు వెలిశాయి. ఆదివాసీల అభివృద్ధికి అడ్డంకిగా మారిన మావోయిస్టులపై తాము తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అందులో పేర్కొన్నారు. కొమరం భీం స్ఫూర్తితో మావోయిస్టుల నియంతృత్వ పోకడపై దండెత్తుతామని తెలిపారు.

గంజాయి పట్టివేత

పినపాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఈ బయ్యారం గ్రామపంచాయతీ ఉప్పాకబ్రిడ్జి వద్ద పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బ్రిడ్జి వద్ద ఎస్‌ఐ రాజ్‌కుమార్ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి ఆటోలో తరలిస్తున్న కేజీ 300 గ్రాముల పట్టుకున్నారు. ఇరువురు తోగ్గూడెం గ్రామానికి చెందిన లోకేష్, ఆదిత్యగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వారి వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

నేటి నుంచి శుభముహూర్తాలు ప్రారంభం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 2025వ సంవత్సరంలో ఏప్రిల్ 30న ఉగాది తర్వాత కొత్త పంచాంగం అందుబాటులోకి వచ్చిందని, ఈ పంచాంగం ప్రకారం ఏప్రిల్ 16 నుంచి శుభముహూర్తాలు అందుబాటులో ఉన్నాయని పండితులు తెలుపుతున్నారు. ఏప్రిల్ 16 నుంచి జూన్ వరకు శుభ కార్యక్రమాలతోపాటు వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. మే నెలలో అధికంగా శుభ ముహూర్తాలు ఉన్నాయని చెబుతున్నారు. ఏప్రిల్ 16, 18, 20, 21, 23, 30 తేదీలలో వివాహాలకు జరుపుకోవచ్చునని చెబుతున్నారు. మే నెలలో 1, 3, 4, 8, 9, 10, 11, 14, 16, 18, 19, 21, 23, 24, 30 తేదీలలో శుభముహూర్తాలు ఉన్నాయి. జూన్‌లో 2, 4, 5, 6, 7 తేదీలలో వివాహాలు జరుపుకోవటానికి వీలుగా ఉందని పండితులు చెబుతున్నారు. జూన్ 11 నుంచి ఆషాడ మాసం ప్రారంభం కానున్నందున ఈ నెలలో ముహూర్తాలు లేవు. జూలై 25 నుంచి శ్రావణమాసం ప్రారంభం కావడంతో శుభముహూర్తాలు రానున్నాయి. ఏప్రిల్ 30న అక్షయ తృతీయ కావడంతో ఆ రోజు ముహూర్తాలు అధికంగా ఉంటాయని పండితులు చెబుతున్నారు. ఏప్రిల్ నెలలో వివాహాలకు ముహూర్తాలు చూసుకున్న వారు పెళ్లిల్లు జరుపుకోవటానికి సిద్ధమవుతున్నారు. పెళ్లిళ్లకు సంబంధించిన వస్తువులు కొనుగోలు చేయడంతో మార్కెట్లో సందడి వాతావరణం మొదలైంది. దీంతో ఈ మూడు నెలల్లో ఫంక్షన్ హాల్స్, డెకరేషన్, వంట మాస్టర్లు, టెంట్‌హౌజ్‌లకు, పండితులు తదితరులకు గిరికీ అధికంగా ఉంటుంది.

ఒక్క నెలకు 1300 యూనిట్లా....

దుమ్ముగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి జీరో బిల్లు విద్యుత్ వినియోగదారునికి ఒక్కసారిగా నెలకు పదమూడు వందల యూనిట్లు వాడకం రావడంతో అవాక్కయ్యాడు. నమోదైన రీడింగ్‌ను లెక్కించే అవకాశం బిల్లింగ్ యంత్రంలో లేకపోవడంతో బిల్లు కూడా తీయడం సాధ్యపడలేదు. కాశీనగరానికి చెందిన ఎ. లక్ష్మీనారాయణ పేరున 08246-00035 సర్వీసు నెంబరు గల మీటరు ఉంది. గత నెల గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు రాగా, ఈనెల 15న మీటరు రీడింగ్ తీసే క్రమంలో ఒక నెలకు రూ.1,300 యూనిట్లు వినియోగించినట్లు నమోదైంది. ఒక ఫ్యాను, టీవీ, రిఫ్రిజరేటర్ ఉన్న ఇంటికి ఇంత స్థాయిలో బిల్లు రావడంతో వినియోగదారుని గుండె గుబేల్‌మంది. ఇటీవల పిడుగుపాటుకు విద్యుత్ మీటరు కాలిపోవడంతో ఈ సమస్య తలెత్తి ఉండొచ్చని రీడింగ్ తీసే సిబ్బంది తెలిపారు.

కోచ్‌ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మధిర, వైరా, కల్లూరు మినీ స్టేడియాల్లో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు గాను కోచ్‌ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీ డల శాఖ అధికారి సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధిర స్టేడియంలో షటిల్, కబడ్డీ విభాగాలకు, వైరా స్టేడియంలో షటిల్, లాన్‌టెన్నిస్, కల్లూరు మినీ స్టేడియంలో షటిల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, ఖో-ఖో విభాగాలకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన కోచ్‌లను నియమించనున్న ట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల ఎన్‌ఐఎస్ శిక్షణ పొంది సర్టిఫికెట్ ఉన్న వారు, సీనియర్ క్రీడాకారులు ఈనెల 22 కల్లా తమ దరఖాస్తుల ను సర్ధార్‌పటేల్ స్టేడియంలోని కార్యాలయంలో అందజేయాలని కోరారు.

జాతీయ మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏసీపీ వెంకట్రావు

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని కోచ్చిలో ఈనెల 11 నుంచి 15 వరకు జరిగిన ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ పోటీలలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్, ఏసీపీ ఘంటా వెంకట్రావు సత్తా చాటి కాంస్య పతకం సాధించారు. పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆయన 50 సంవత్సరాలపైన ఏజ్ గ్రూప్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా పోలీస్ పోటీలలో పతకం సాధించిన ఆయనను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, సెక్రెటరీ వి. చంద్రశేఖర్, ట్రెజరర్ జట్ల శ్రీను తదితరులు అభినందించారు.

వేసవిలో...
పశువులు జాగ్రత్త



ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఈ వేసవిలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5–8 డిగ్రీల సెల్షియస్ మేరకు ఎక్కువగా నమోదయ్యే సూచనలు ఉన్నాయని భారత వాతావరణ విభాగం కొద్ది రోజుల క్రితమే హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మున్ముందు ప్రచండ వడగాడ్పులు వీచే సూచనలు ఉన్నాయంటున్నారు. ఈ నేపథ్యంలో పశు పోషకులు గత వేసవిలో కన్నా అధికంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు..

- వేడి వాతావరణం వలన పాలు ఇచ్చే పశువుల్లో శరీర ఉష్ణోగ్రత 0.5 నుండి 3.5 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు పెరుగుతుంది. ఉష్ణోగ్రతలుపెరగడం వలన పశువులు ఎక్కువగా నీటిని తీసుకొని, తక్కువ మేత తినడం వలన పాల దిగుబడి 11 శాతం వరకు తగ్గుతుంది కొన్ని యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా కొంత వరకు నష్టాన్ని నివారించుకోవచ్చు.
- వేసవి కాలంలో ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులు వీచడం వల్ల ఉష్ణతాపానికి గురై పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ళు తీవ్ర అసౌకర్యానికి, అనారోగ్యానికి లోనుకావడమే కాకుండా వడదెబ్బకు గురవుతూ ఉంటాయి. కాబట్టి, పశుపోషకులు, గొర్రెలు మేకల పెంపకదారులు వేసవికాలంలో కొన్ని జాగ్రత్తలు తీసుకొని పశువులు, గొర్రెలు మేకలు అనారోగ్యానికి గురికాకుండా, వడదెబ్బ బారిన పడకుండా సంరక్షించుకోవచ్చు. వాతావరణ మార్పులకు అనుగుణంగా శాస్త్రీయ యాజమాన్య పద్ధతిని పాటించడం ద్వారా ఉత్పాదక శక్తి తగ్గకుండా రైతు ఆశించిన ఫలితాలను పొందవచ్చు.
- కొన్ని సమయాల్లో దాహంతో ఉన్న పశువులు మురికి గుంటల్లో ఉన్న నీటిని తాగడం వల్ల పారుదు వంటి జీర్ణకోశ వ్యాధులు రావచ్చు. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవించే అవకాశాలున్నాయి. వడదెబ్బకు గురైన పశువుల్లో దాహం పెరుగుతుంది. తూలుతూ నడుస్తూ పడిపోవడం, రొప్పుతూ, శ్వాస కష్టమవడంతో ఒక్కొక్కసారి అపస్మారక స్థితికి వెళ్లి మరణించే ప్రమాదం ఉంటుంది.
- వేసవి తాపంతో జీర్ణక్రియ సన్నగిల్లుతుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ లాంటి పదార్థాలు ఇవ్వడం మంచిది. ఎక్కువ శాతం పచ్చిగడ్డి ఇవ్వాలి. ఒకవేళ మాగుడు గడ్డి సమృద్ధిగా ఉంటే అందించవచ్చు. పచ్చిగడ్డిని ఉదయం సమయాల్లో, ఎండుగడ్డిని రాత్రి సమయాలలో వేర్వేరుగా ఇవ్వాలి. అధిక పాలిచ్చే పశువులకు దాణాను నీటితో కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మంచిది.
- మేత కోసం పశువులను ఎండవేళల్లో కాకుండా ఉదయం పూట 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు బయటకు పంపడం మంచిది. వేసవి తాపానికి గురైన పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. వ్యాధి నిరోధక టీకాలు ఇది వరకు వేయించని పశువులు, గొర్రెలు, మేకలకు గాలికుంటు వ్యాధి, గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. దాహంతో ఉన్న పశువులు మురుగునీరు తాగటం వల్ల పారుడు వంటి జీర్ణకోశ రోగం వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఎల్లవేళలా మంచి చల్లని తాగునీరు ఇవ్వాలి. అంతర పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా తాగించాలి.

సంరక్షణ ఇలా..

అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, షెడ్లలో అధిక సంఖ్యలో కిక్కిరిసి ఉండటం, ఉక్కపోత, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి, బలహీనంగా మారతాయి. పశువులు సరిగా నడవలేక, తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. జీవక్రియ తగ్గిపోవడం, ఆకలి మందగించడం, మేత తక్కువగా తీసుకోవడం వల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గటం వలన ఇతర వ్యాధులు, పరాన్నజీవులు ఆశించే అవకాశం పెరుగుతుంది.

వడదెబ్బకు గురైన పశువులకు ప్రథమ చికిత్స..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లి శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి పలుమార్లు నీటితో కడగాలి. తల నుదుటి మీద మంచుముక్కలు ఉంచాలి లేదా చల్లని గోనె సంచిని దానిపై కప్పాలి. వెంటనే పశువైద్యున్ని సంప్రదించాలి. పశువైద్యుని పర్యవేక్షణలో గ్లూకోజ్ సెలైన్, సోడియం క్లోరైడ్ అందించాలి. శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి తగిన చికిత్స చేయించాలి.

ఎల్లాపురంలో ట్రెంచ్ పనుల అడ్డగింత


అటవీశాఖ అధికారులను గ్రామంలో రాకుండా అడ్డుకుంటున్న దృశ్యం

ఇల్లెందురూరల్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): పోడుభూముల్లో ట్రెంచ్ పనులను చేసేందుకు వస్తున్న అటవీశాఖ అధికారులను ఆదివాసీ మహిళలు అడ్డుకున్నారు. ఈ సంఘటన ఇల్లెందు మండలం ఎల్లాపురంలో మంగళవారం జరిగింది. ఇల్లెందు మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురం గ్రామంలో ఆదివాసులు 30 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో ట్రెంచ్ పనులను నిర్వహించేందుకు మంగళవారం అటవీశాఖ అధికారులు ఎక్స్‌కవేటర్లతో వస్తుండగా, గ్రామంలోనికి రానివ్వకుండా దారికి అడ్డంగా మొద్దులు వేసి మహిళలు అడ్డుకున్నారు. తమ సాగు పోడు భూముల్లో ట్రెంచ్ పనులు చేపట్టవద్దని అధికారులను నిలదీసి వెళ్లగొట్టారు. తమ సాగు భూముల జోలికి వస్తే ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం ఆధ్వర్యంలో తిరుగుబాటు తప్పదని ఆదివాసీ మహిళ నాయకురాలు హెచ్చరించారు.

వీధి వ్యాపారుల తొలగింపు


వీధి వ్యాపారుల సామగ్రిని తరలిస్తున్న డీఆర్‌ఎఫ్ బృందాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రధాన రహదారుల వెంట రోడ్డును అక్రమించిన వీధి వ్యాపారుల్లో కొంతమందిని కేఎంసీ డీఆర్‌ఎఫ్ బలగాలు తొలగించారు. ఇల్లెందు క్రాస్ రోడ్డు, వైరా రోడ్డులోని ఆక్రమణలను తొలగించారు. అనంతరం వీధి వ్యాపారులకు జరిమానా విధించారు. 4వ డివిజన్‌లో యూపీఎస్ కాలనీ, వెంకటేశ్వరనగర్ కాలనీలో రహదారిపైకి వచ్చిన చెట్ల కొమ్మలను కత్తిరించి రహదారికి ఇబ్బంది లేకుండా చేశారు. డీఆర్‌ఎఫ్ బలగాలు ఇరుగు శివ, వీ. వెంకటేష్, రాజేశ్, విజయ్, పిట్టల బాబురావు, నారపోగు వీరబాబు, బండి శివశంకర్ పాల్గొన్నారు.

అమెరికాలో అనారోగ్యంతో మధిర వాసి మృతి


రమేష్

మధిర రూరల్ ఏప్రి ల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్కూరు గ్రామానికి చెందిన వెలగపుడి రమేష్(47) అమెరికాలో అనారోగ్యంతో మృతిచెందాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న రమేష్ అమెరికాలో డల్లాస్‌లో ఉంటున్నాడు. బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో రెండు రోజుల క్రితం అక్కడే చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని అమెరికా నుంచి స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు రమేష్ స్నేహితులు, తానా కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. మరో ఐదు రోజుల్లో మృతదేహాన్ని తీసుకువచ్చే అవకాశాలున్నట్టు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

న్యాయం చేయాలని మహిళ నిరసన

» కొత్తగూడెంలో ఘటన

చుంచుపల్లి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నాపై కేసులు పెట్టారని...నాకు న్యాయం చేయండి అంటూ ఓ మహిళ కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి మంగళవారం నిరసన ధర్నా చేపట్టింది. ఈ సంఘటనకు సంబంధించి ఆ మహిళ కొర్రా నిరోషా విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. చుంచుపల్లి మండలంలోని నందాతండా పంచాయతీకి చెందిన కొర్రా బాబు, నిరోషా దంపతులు, వారి ఇద్దరి సంతానంతో కలిసి నివసిస్తున్నారు. భర్త బాబు కొత్తగూడెం డిఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడని, మా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయని తెలిపింది. ఈ క్రమంలో మరొక మహిళతో కావాలనే తనపై తన భర్త కొర్రా బాబు ఈ నెల 11న అక్రమంగా కేసు పెట్టించారని తెలిపింది. తనకు పోలీసులు మద్దతు ఇవ్వకుండా తన భర్త పోలీస్ శాఖలో పని చేస్తుండడం కారణంగా అక్రమంగా కేసు పెట్టారని ఆరోపించింది. తనపై కేసు పెట్టారని, ఎందుకు పెట్టాల్సి వచ్చిందని ప్రశ్నిస్తే తమకు న్యాయం జరగడం లేదని పోలీసు ఉన్నతాధికారులు దగ్గరికి వెళ్లిన న్యాయం చేయడం లేదని ఆరోపించింది. అందుకే పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి నిరసన ధర్నా చేపట్టినట్లు స్పష్టం చేసింది. ఈ విషయంపై కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ నెల 11న రామవరం ప్రాంతానికి చెందిన ఓ మహిళ నిరోషాపై ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి ఒత్తిడిలు లేవని, నిరాధార ఆరోపణలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉందని విచారణ అనంతరం నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని టూటౌన్ సీఐ తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీకి యత్నం


చెట్టుపక్కన పడేసి ఉన్న హుండీ

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినాయకపురంలో గల చిలకలగండి ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఆలయ బయట ఉన్న హుండీని వెనకభాగాన ఉన్న చెట్టు పక్కన పడేసి, హుండీని పగలగొట్టేందుకు యత్నించారు. హుండీ తెరుచుకోకపోవడంతో అక్కడే పడేసి వెళ్లిపోయాడు. ఉదయం ఆలయానికి వచ్చిన సిబ్బంది హుండీని చెట్టుకింద ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. హుండీ తెరుచుకోకపోవడం, కొద్దిరోజులు క్రితమే హుండీలను లెక్కించడంతో ఎటువంటి నగదు పోలేదని ఆలయ ఛైర్మన్ నరాల శ్రీనివాసరావు తెలిపారు.



యూజీసీ పేస్కేల్ అమలు చేయాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలలో రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్ అమలు చేయాలని ఆల్ యూనివర్శిటి పార్ట్ టైం అధ్యాపకుల అసోషియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని యూనివర్శిటి పీజీ కళాశాలలో చేపట్టిన నిరసనలో పీజీ, బీపీఈడి కళాశాలకు చెందిన పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం పాత సర్వీసును పరిశీలించి కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరన్న, రవిబాబు, రమ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలు బాసటగా నిలవాలి



» మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దాలి
» ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే బాలలకు భవిత కేంద్రాలు బాసటగా నిలవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో భవిత కేంద్రాల ఆదునికీకరణపై సమీక్షించారు. జిల్లాలో 8 భవిత కేంద్రాలు ఉన్నాయని వీటిలో ప్రత్యేక అవసరాల పిల్లలు విద్యతో పాటు, వారిని సాధారణ పిల్లలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని భవిత కేంద్రాలను, మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దాలన్నారు. భవిత కేంద్రాల్లో పిల్లలు ఎక్కువగా నమోదై, అవసరాలు ఉన్న దానిని పూర్తిస్థాయిలో ఆదునికీకరణ చర్యలు తీసుకోవాలన్నారు. భవిత కేంద్రాల్లో ఉపకరణాలు, వసతుల కల్పనకు ఏర్పాటుచేసిన 3మెన్ కమిటీ భవిత కేంద్రాల క్షేత్ర స్థాయి తనిఖీలు చేసి కార్యాచరణ చేయాలన్నారు. మే నెలలో చేపట్టే బడిబాట కార్యక్రమంలో ఐఈఆర్పీ లు ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించాలన్నారు. మండలాల వారిగా పదో తరగతి పూర్తయినవారి జాబితాతీసుకొని, వారు ప్రభుత్వ కళాశాలల్లో నమోదు అయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, వీటితోపాటు ప్రభుత్వ కేజీబీవీ, రెసిడెన్షియల్ కళాశాలలు ఉన్నాయని, వీటిలో 100 శాతం నమోదు జరిగేలా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, విద్యాశాఖ ఆర్ఎంఓ రాజశేఖర్, 3మెన్‌కమిటీ సభ్యులైన ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

వేతనాలపై కాంట్రాక్టర్ కిరికిరి

» ఐదు నెలలుగా కేఎంసీ కార్మికులకు అందని వైనం
» కమిషనర్ ఛాంబర్ ఎదుట నిరసన



కమిషనర్ చాంబర్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల వేతనాల చెల్లింపుపై కాంట్రాక్టర్లు కిరికిరి పెడుతున్నారు. నిబంధనల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థకు కార్మికులకు అనుసంధానంగా కాంట్రాక్టర్ వ్యవస్థ ఉంది. కేఎంసీ నుంచి మ్యాన్ పవర్ కావాలని నోటిఫికేషన్ వేస్తే సదరు కాంట్రాక్టర్ కాంట్రాక్టు పొందిన తర్వాత కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి. ఆ తర్వాత కేఎంసీ నుంచి వచ్చిన బిల్లులను పొందాల్సి ఉంటుంది. అయితే ఖమ్మం నగర పాలక సంస్థకు సొంతంగా వాహనాలు సమకూర్చుకోవటంతో తర్వాత బిల్లులు రావని భావించిన కాంట్రాక్టర్ గడువు ముగిసే లోపుగా తన బిల్లులు పొందాలని ఎత్తుగడ వేసినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి.

కొత్త వాహనాలతో పీటముడి

15వఆర్థిక సంఘం నిధులను ఖమ్మం నగర పాలక సంస్థ సద్వినియోగం చేసుకొంది. ఆ నిధులతో కేఎంసీ సొంతంగా ట్రాక్టర్లు, ట్రాలీలు కొనుగోలు చేస్తోంది. మరో పక్షం రోజుల్లో కేఎంసీ సొంతంగా వాహనాల నిర్వాహణ చేపట్టనుంది. అయితే ఖమ్మం నగరంలో ఓ మ్యాన్ పవర్ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం కార్మికుల వేతనాలకు పీటముడి వేశారు. తనకు కేఎంసీ నుంచి బిల్లులు రావటం లేదని, అందుకే డబ్బులు ఇవ్వలేనని పేచీపెట్టారు. దీంతో మూడు నెలలుగా నగర పాలక సంస్థ చుట్టూ కార్మికులు తిరుగుతూ కార్యాలయం ఎదుట, కమిషనర్ ఛాంబర్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడ్తున్నారు. అయితే కేఎంసీ నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిల ఒకనెలవి మాత్రమే ఉన్నాయి. కానీ కార్మికులకు మాత్రం ఎక్కువ నెలలు వేతనాల బకాయిలు పెరిగాయి.

కమిషనర్ చాంబర్ ఎదుట నిరసనలు

ఖమ్మం నగరంలో పనిచేస్తున్న కార్మికులు సీఐటీయూ,టీయూసీఐ,ఐఎన్‌టీయూసీ నాయకులు తుమ్మ విష్ణువర్దన్, జీ రామయ్య, నరేశ్ నాయుడుతో మంగళవారం కేఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. బిల్లుల కోసం కాంట్రాక్టర్ నివాసానికి వెళితే పోలీసు కేసులు పెడ్తామని బెదిరించారని ఆరోపించారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య జోక్యం చేసుకొని వేతనాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కమిషనర్ ఛాంబర్ ఎదుట ఉద్రిక్త పరిస్థితి ఏర్పడటంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. అనంతరం కమిషనర్‌ను కలిసి ఎన్ని నెలల నుంచి వేతనాలు రాలేదు జాబితాను అందించారు.

న్యాయవాది నాగేంద్ర సేవలు మరువలేనివి

బార్ అసోసియేషన్ సంతాపం

ఖమ్మంలీగల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన న్యాయవాది గురిజాల నాగేంద్ర ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. మంగళవారం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు మోతుకూరి విజయశాంత అధ్యక్షత బార్ అసోసియేషన్ హాల్లో సంతాపసభ ఏర్పాటు చేశారు. వారి సేవలను కొనియాడారు. అనంతరం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గద్దల దిలీప్‌కుమార్, కార్యవర్గ సభ్యులు,తెలుగుదేశం లీగల్‌సెల్, కాంగ్రెస్ లీగల్‌సెల్ ఐలు, ఐఏఎల్, బీఆర్ఎస్ లీగల్‌సెల్, న్యాయవాద సంఘాల న్యాయవాదులు వారి కుటుంబానికి సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

హోంగార్డు ఆఫీసర్‌కు సన్మానం

ఖమ్మంక్రైం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన సత్తుపల్లి యూనిట్‌హోంగార్డు ఆఫీసర్ మిట్టపల్లి వాణిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తన కార్యాలయంలో శాలువాతో సన్మానించారు.ఈకార్యక్రమంలో హోంగార్డు యూనిట్ ఆఫీసర్ ఆర్ఐ సురేష్,నవీన్‌కుమార్, శ్రీను, వెంకటేశ్వర్లు, నీరజ, పాల్గొన్నారు.

నేడు నగరానికి తనిఖీ బృందాలు

» ఓడీఎఫ్ ప్లస్ ప్లస్, జీఎఫ్‌సీ కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన
» జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ ఇచ్చిన అధికారులు



అవగాహన కల్పిస్తున్న ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీరు శ్రీనివాస్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛసర్వేక్షణ్ సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో రాష్ట్రంలో రెండో స్థానంలోకి చేరిన ఖమ్మం నగరం, ఇప్పుడు మరో రెండు అడుగులు ముందుకేయబోతుంది. బహిరంగ మల మూత్ర విసర్జన రహిత నగరంతో పాటుగా చెత్త లేని క్లీన్ సిటీ(గార్బేజ్ ఫ్రీ సిటీ) రేస్‌లోకి చేరుతుంది. ఇందు కోసం ఖమ్మం నగరానికి బుధవారం రెండు బృందాలు రానున్నాయి. బహిరంగ మల,మూత్ర విసర్జన రహితం కోసం ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్‌తో పాటుగా గార్బేజ్ ఫ్రీసిటీ బృందాలు విడివిడిగా ఖమ్మం నగరంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నారు. ఖమ్మం నగరంలో తడి, పొడి, హానికరమైన చెత్త సేకరణ విధానం పరిశీలిస్తారు. సేకరించిన తర్వాత వాటిని రవాణా అంశాలను పరిశీలిస్తారు. ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్య వాహనాల నిర్వాహణపై పరిశీలిస్తారు. అలాగే డ్రైనేజీల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, కమర్షియల్ ప్రాంతాల్లో రెండు సార్లు పరిశుభ్రత అంశాలను తనిఖీలు చేస్తారు. వారం పాటుగా రెండు బృందాలు 60డివిజన్లను పూర్తి స్థాయిలో పరిశీలన చేయనున్నారు.

జవాన్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ

ఓడీఎఫ్‌ప్లస్‌ప్లస్, జీఎఫ్‌టీ కోసం ఖమ్మం నగర పారిశుధ్య విభాగం అధికారులు సిద్ధమయ్యారు. మంగళవారం ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జవాన్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్లుకు శిక్షణ ఇచ్చారు. బృందాలు పరిశీలించే అంశాలు, వాటికి ఎన్ని మార్కులు వస్తాయి. అనే అంశాలను ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ మల్లేల శ్రీనివాసరావు, పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య వివరించారు.పబ్లిక్ ప్రాంతాలు నిర్వహణ, మరుగుదొడ్లు పరిశుభ్రత, వాటర్‌బాడీల నిర్వాహణపై వివరించారు.

డివిజన్‌ల్లో ఏది జరిగినా

వార్డు ఆఫీసర్లదే బాధ్యత



» 17వరకు ఇందిరమ్మ ఇళ్ల నివేదికలు పంపాలి
» కమిషనర్ అభిషేక్ అగస్త్య
» వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో డివిజన్లు వారీగా వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు కేటాయించామని, ఆయా డివిజన్లలో ఏది జరిగినా వార్డు ఆఫీసర్లు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లెవల్ 1 సర్వేను ఖమ్మం నగరంలో బుధవారం నూరుశాతం పూర్తి చేయాలన్నారు. గురువారం నివేదికలు, సాంకేతిక అంశాలను పరిశీలన చేసుకోని కలెక్టర్‌కు పంపాలని ఆదేశించారు. మంగళవారం కేఎంసీ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తో కమిషనర్ రివ్యూ నిర్వహించారు. ఖమ్మం నగరంలో 5,754 ఇళ్ల సర్వేకు గాను ఇప్పటి వరకు 3,954 ఎల్1 సర్వే పూర్తి జరిగిందన్నారు. ఇళ్ల కేటాయింపులో అర్హత కలిగిన నిరుపేదలను మాత్రమే ఎల్1లో సిఫారసు చేయాలన్నారు. సర్వే పెండింగ్‌లో ఉన్న వారు వెంటనే పూర్తి చేయాలని, సర్వే పూర్తి జరిగిన వారు మరో సారి పరిశీలన చేసుకోవాలని ఆదేశించారు. వార్డు ఆఫీసర్లు వారికి కేటాయించిన డివిజన్లల ఇందిరమ్మ లబ్ధిదారుల గుర్తింపు జాబితాలను పరిశీలన చేయాలని సూచించారు. ఆర్వో జీ శ్రీనివాసరావు, ఆర్ఐలు జ్యోతి, వజ్జా రామారావు, రాంబాయి, కవిత, శ్రీను పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పక్కా ప్రణాళికలు ఉండాలి

ఖమ్మంలో తాగునీటి సమస్య పరిష్కారానికి పక్కా ప్రణాళికలు ఉండాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించు కోవాలన్నారు. పాలేరు రిజర్వాయర్‌లో 90రోజులకు సరిపడ నీటి నిల్వలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి అవసరాల తీర్చేందుకు 548 హ్యాండ్‌బోర్లు, 76పవర్ బోర్లు, 14ట్యాంకర్లను అందుబాటులో ఉంచామని కమిషనర్ వివరించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ఏఈలు లైన్‌మ్యాన్‌లను అప్రమత్తం చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఈఈ కృష్ణలాల్, డీఈలు ధరణ్, శ్రీనివాసరావు, ఏఈలు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన డీఏవో

వైరా,ఏప్రిల్15(ఆంధ్ర జ్యోతి):ఆదివారంరాత్రి ఈదురుగాలులకు వైరా మండలంలో దెబ్బతిన్న పంటలను జిల్లావ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య మంగళవారం పరిశీలించారు.

ఖమ్మం-మహబూబాబాద్ రోడ్డుకు

వనజీవి రామయ్య పేరు పెట్టాలి

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వద్దిరాజు

ఖమ్మంరూరల్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-మహబూబాబాద్ రోడ్డుకు వనజీవి రామయ్య మార్గ్ పేరుతో నామకరణం చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఇటీవల మృతిచెందిన వనజీవి రామయ్య ఇంటికి మంగళవారం వెళ్లారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖమ్మం నుండి రెడ్డిపల్లి వరకు 8 కిమీ మేర వనజీవి రమయ్య మొక్కలు నాటారని గుర్తు చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆ చెట్లన్నీ కూల్చేసినందున మళ్లీ అదే వరుసలో మొక్కలు నాటి సంరక్షించి రామయ్యకు నివాళులర్పించాలన్నారు. రామయ్య చరిత్ర బావి తరాలకు తెలిసేలా కర్ణాటక తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా పాఠ్యపుస్తకాల్లో ఆయన చరిత్రను ప్రవేశపెట్టాలన్నారు. జిల్లాలో ఆయన స్మారకం ఏర్పాటు చేయాలన్నారు.

కబడ్డీ విజేత పెరిక కౌసల్య మెమోరియల్ జట్టు



పెరిక కౌసల్య మెమోరియల్ టీం

కొణిజర్ల,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని తనికెళ్లలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఐదు రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలలో విజేతగా కొణిజర్ల పెరిక కౌసల్య పేరుతో ఆడిన నల్గొండ టీమ్ మొదటి విజేతగా నిలిచింది. రెండో బహుమతి ఖమ్మం అకాడమీ టీమ్ గెలుచుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో క్రీడాకారులను కొణిజర్ల ఎస్ఐ సూరజ్ పరిచయం చేసుకొని ప్రారంభించారు.

అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కృతజ్ఞత సభను నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు ప్రజల కోసం నిత్యం పనిచేస్తున్నారన్నారు. సీఎం, రాష్ట్ర మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, మొక్క శేఖర్‌గౌడ్, హుస్సేన్ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, నాయకులు

జీవన నైపుణ్యాలు మెరుగు పరుచుకోండి

తిరుమలాయపాలెం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవన నైపుణ్యాలు మెరుగుపరుచుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెసర ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జల్లేపల్లి ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడారు. జీవననైపుణ్యాలు ఎంచుకోవడం, వాటిని ఆచరించడం, అలవాటుగా చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు విద్యార్థులు ఎదుగుతారన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం దారా రాజేష్, ఉపాధ్యాయులు రామారావు, పార్థసారధి, రంజిత్, నళిని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భూభారతి రైతులకు వరం

నేలకొండపల్లిలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



నేలకొండపల్లి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ధరణి స్థానంలో రేవంత్ సర్కార్ తెచ్చిన భూభారతి చట్టం రైతులకు వరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ధరణిలోని తప్పులను సరిచేస్తూ రైతుల మేలు కోసం కాంగ్రెస్ సర్కార్ భూభారతి చట్టాన్ని తెచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, కొమ్మూరి నరేష్, షేక్.ఖాజా మియా, బచ్చలకూరి నాగరాజు, బొడ్డు బొందయ్య, మైసా శంకర్, లక్కం ఏడుకొండలు, మేకల శ్రీను, షేక్.సోందు, మానికొండ శ్రీనివాసరావు, కుక్కల హనుమంతరావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణతో యువతకు ఉపాధి

నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్



యువతికి సర్టిఫికెట్‌ను అందచేస్తున్న ఎస్ఐ సంతోష్

నేలకొండపల్లి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ శిక్షణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్ అన్నారు. సీపీఐ(ఎం) కార్యాలయంలో ఎన్టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంగళవారం ఆయన సర్టిఫికెట్లను అందచేశారు.నిత్యం ఉద్యమాలతో బిజీగా ఉండే కమ్యూనిస్టులు కంప్యూటర్ శిక్షణతో పాటుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. సేవాభావంతో నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు కంప్యూటర్ శిక్షణ నిర్వహించటం అభినందనీయమన్నారు. ఎన్నారై ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బయ్యన బాబూరావు మాట్లాడుతూ సమాజంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను యువత గమనిస్తూ ఉండాలని, తమ చుట్టూ ఉన్న పరిస్థితులను అధ్యయనం చేస్తుండాలన్నారు. తమ వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకోవాలని, తద్వారా సమాజంలో విలువైన, సంస్కారవంతమైన జీవితం గడపటానికి ఉపయోగపడుతుందన్నారు. ఈసందర్భంగా మండల పరిధిలోని పైనంపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మందడపు శ్రీనివాసరావు ఎన్టీఆర్ ఫౌండేషన్‌కు రూ.15వేలను విరాళంగా అందించారు. తొలుత రెండోబ్యాచ్ కంప్యూటర్ శిక్షణను ఎస్ఐ సంతోష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు, కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, కోశాధికారి గుడవర్తి నాగేశ్వరరావు, సత్యసాయిసేవా ట్రస్టుకు చెందిన వంగవీటి కృష్ణారావు, గెల్లా వెంకటరమణగుప్తా, ఈగా అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి యర్రా శ్రీకాంత్

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తన జీవితాంతం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన యోధుడు యర్రా శ్రీకాంత్ అని సీపీఎం మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల పరిదిలోని మంగళగూడెం, పల్లెగూడెం, పోలేపల్లి గ్రామాల్లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ సంతప సభలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్బంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతు ఖమ్మం మిర్చి మార్కెట్ సమస్యలపై 40 సంవత్సరాలుగా కార్మికుల పక్షన పోరాడుతున్న వీరుడు యర్రా శ్రీకాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పాలేరు డివిజన్ నాయకులు భూక్య నాగేశ్వరరావు, ఉపేందర్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: యర్రా శ్రీకాంత్‌కు మంగళవారం తిరుమలాయపాలెంలో ఘననివాళులర్పించారు. సీపీఎం కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీను, వశపొంగు వీరన్న, కొత్తపల్లి వెంకన్న, కాంపాటి బాబురావు, సుందరయ్య, వెంకటేష్,సైదులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్ హఠాన్మరణం

ఖమ్మంరూరల్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): పెద్దతండాలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న ఎస్‌కే.బురాన్‌బీ(60) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. దహనసంస్కారాలకు రూ.10 వేలు అందజేశారు.

పేదవిద్యార్థుల కోసం విద్యానిధి

వైరా,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు హైస్కూల్లో నిరుపేద విద్యార్థుల కోసం గరికపాడు సొసైటీ డైరెక్టర్ మేరుగు రత్నరాజు ఆధ్వర్యంలో విద్యానిధిని ఏర్పాటుచేశారు. దాతల నుంచి నిధులు సేకరించి నిరుపేద విద్యార్థుల పరీక్ష, కోచింగ్ సెంటర్లకు అవసరమైన ఫీజులను చెల్లిస్తామని రత్నరాజు తెలిపారు. గరికపాడు గ్రామానికి చెందిన జూనియర్ లెక్చరర్ మాతంగి పాపారావు రూ.పదివేలను విద్యానిధికి జమ చేశారు. సేకరించిన నిధులను గరికపాడు హైస్కూల్ విద్యానిధి పేరుతో బ్యాంకు ఖాతా ప్రారంభించి నిధులను ఖర్చుచేస్తామని రత్నరాజు తెలిపారు. కార్యక్రమంలో మాతంగి రాంబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మధిర రూరల్ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగవీడు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మధిర మార్కెట్ యార్డు చైర్మన్ బండారు నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతుల సంక్షేమంకోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని, పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కిషోర్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు అయిలూరి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవికుమార్, మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు దారా బాలరాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుమాటి నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

» ప్రారంభించి రెండేళ్లు దాటినా పూర్తికాని రహదారి » త్వరగా పనులు పూర్తి చేయాలని గ్రామస్థుల వినతి



అసంపూర్తిగా ఉన్న లంకాసాగర్ బీటీ రోడ్డు

పెనుబల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండాలపాడు క్రాస్‌రోడ్డు నుంచి లంకాసాగర్ గ్రామం వరకు 2023 జనవరిలో రూ.ఏడున్నర కోట్లతో చేపట్టిన ఏడుమీటర్ల వెడల్పుతో ఐదుకిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్ రహదారి నిర్మాణానికి సంబంధించిన కల్వర్టులు, తదితర పనులు పూర్తిచేశారు. దీనికి సంబంధించి రూ.1.70కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అవి మంజూరుకాకపోవడంతో పనులను నిలిపివేసినట్టు తెలియవచ్చింది. ఈ రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలని లంకాసాగర్, సూరయ్యబంజర్ గ్రామాలకు చెందిన ప్రజలు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. ఇటీవల లంకాసాగర్ ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు కూడా ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయించాలని ప్రజలు కోరారు. ఈ రహదారి గుండా అనేక రైస్‌మిల్లులకు ధాన్యం తీసుకువచ్చే లారీలతోపాటు నిత్యం అనేక వాహనాలు తిరుగుతూ రద్దీగా మారింది. రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో లేచే దుమ్ముతో ద్విచక్రవాహనదారులు, బాటసారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి తమ గ్రామానికి వెళ్లేందుకు అవకాశం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలి



పులపాక రాజా, గ్రామస్థుడు

మండాలపాడు క్రాస్‌రోడ్డు నుంచి తమ గ్రామం వరకు రిపేర్ల పేరుతో రహదారిని తొలగించారని, ఏళ్ల గడుస్తున్నా రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. దీంతో సామాన్యులు ఈ రహదారిలో వెళ్లే అవకాశం లేకుండా పోయింది. వెంటనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

ప్రజలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైరా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, బాణోతు మదన్‌లాల్ విమర్శించారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేదానిలో భాగంగా మంగళవారం వైరాలో జరిగిన మండలస్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రచార వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, తాటిపూడి మాజీ సర్పంచ్ బట్టా పెద్దభద్రయ్య, నాయకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వనమా విశ్వేశ్వరరావు, మాదినేని ప్రసాద్, సునీత, దొంతెబోయిన వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కనకరత్నం, దేవరాజు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: సండ్ర



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సండ్ర

తల్లాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో కల్లాల్లో ఆరబోసి అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యం వల్ల నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడారు. గన్నీసంచులు ఇవ్వకపోవడం వల్ల 15రోజులుగా కల్లాల్లోని ధాన్యంతో వేచి చూడాల్సి వస్తుందని రైతులు వాపోయారు. గన్నీసంచులు సరఫరా చేసి ఉన్నట్లయితే ధాన్యం కాంటాలు వేసి ఎగుమతి చేయడం వల్ల నష్టం వాటిల్లేది కాదని రైతులు తెలిపారు. అనంతరం వెంకటవీరయ్య మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, నాయకులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, కోడూరి వీరకృష్ణ, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, ఎంఆర్పీఎస్ నాయకులు ఇసన్నపల్లి అశోక్, వీరయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

తల్లాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం తెలగవరం గ్రామానికి చెందిన మారుతి అంజలికి రూ.34,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం ఎమ్మెల్సీ తాతా మధు అందజేశారు. మారుతి రామయ్య అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నందుకు ఆయన వైద్యఖర్చులకుగానూ సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేతినేని చలపతిరావు, ముప్పా మురళీధర్‌రావు, దిరిశాల దానూరావు పాల్గొన్నారు.

విద్యానిధి ఏర్పాటు

వైరా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు హైస్కూల్లో నిరుపేద విద్యార్థుల కోసం గరికపాడు సొసైటీ డైరెక్టర్ మేరుగు రత్నరాజు ఆధ్వర్యంలో విద్యానిధిని ఏర్పాటు చేశారు. దీని ద్వారా దాతల నుంచి నిధులు సేకరించి నిరుపేద విద్యార్థుల పరీక్ష, కోచింగ్ సెంటర్లకు అవసరమైన ఫీజులను చెల్లిస్తామని ఆయన తెలిపారు. దానిలో భాగంగానే గరికపాడు గ్రామానికి చెందిన జూనియర్ లెక్చరర్ మాతంగి పాపారావు రూ.పదివేలను విద్యానిధికి జమ చేశారు. తాము సేకరించిన నిధులను గరికపాడు హైస్కూల్ విద్యానిధి పేరుతో బ్యాంకు ఖాతా ప్రారంభించి ఖాతా నుంచి నిధులను ఖర్చుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాతంగి రాంబాబు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డలకు పోషకాహారం లేకుంటే అనారోగ్య సమస్యలు తప్పవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గంగాజలం అన్నారు. మంగళవారం సత్తుపల్లి మండలం రామగోవిందాపురంలో పోషణ పక్వాడాలో భాగంగా సమావేశం నిర్వహించారు. అనంతరం ఇరువురు గర్భిణీలకు సీమంతాలు, ముగ్గురు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ షీలా, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణకుమారి, సౌభాగ్యం, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.

రైతులు ఎక్కడా ఇబ్బందులు పడటం లేదు



మాట్లాడుతున్న ఆనంద్ బాబు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రైతులు ఎక్కడా ఇబ్బందులు పడటం లేదని, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను అడ్డుగా చూపి ధాన్యం కొనడం లేదని ధర్నా చేయడం సరికాదని, మాయిశ్చర అయిన తర్వాత రైతుల వద్ద నుంచి మార్కెట్ యార్డులలో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమా ఆనంద్ బాబు, నాయకులు గాదె చెన్నారావు, ఎండీ. కమల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

మధిరటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు మంగళవారం మధిర తహసీల్దార్ ఆర్. రాంబాబు మధిర పట్టణంలోని ఓ రేషన్‌షాపును తనిఖీ చేసారు. లబ్ధిదారులు ఎవరూ సన్నబియ్యం పథకాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని ప్రభుత్వ గొప్ప సంకల్పంతో పేదలు అందరు కడుపునిండా తినాలనే ఉద్దేశంతో సన్నబియ్యం ఇస్తుందని అన్నారు.

పేదలకు సన్నబియ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం: పువ్వాళ్ల



సన్నబియ్యం భోజనం చేస్తున్న పువ్వాళ్ల

బోనకల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు సన్నబియ్యం ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ తెలిపారు. మండలంలోని రాయనపేట గ్రామంలో మంగళవారం ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో సన్న బియ్యంతో భోజనాల కార్యక్రమాన్ని చింతకాయల నారాయణ ఇంట్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పువ్వాళ్ల మాట్లాడుతూ సన్న బియ్యం పేదలకు ఇచ్చేందుకు ఏ పార్టీకి మనస్సు రాలేదన్నారు. తమ ప్రభుత్వం మాత్రం పేదలు కూడ అందరితో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న లక్ష్యంతో చారిత్రాత్మకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. గ్రామాలలో సన్నబియ్యం పంపిణీతో పేదలు పండుగ చేసుకుంటున్నారని, ఇలాంటి ప్రభుత్వం చిరకాలం ఉండాలని ఆశీర్వదిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఆర్.రమాదేవి, సీఐ మధు, ఎస్ఐ మధుబాబు, గిర్దావర్ మైథిలీ, ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, జిల్లా, మండల నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చేబ్రోలు వెంకటేశ్వర్లు, రమ, సౌజన్య, పాసంగులపాటి కోటేశ్వరరావు, మోదుగు సుధీర్‌బాబు, గూడ నర్సయ్యశాస్త్రీ, అనుమోలు వెంకటేష్, ములకారపు రవి, ఆదిలక్ష్మీ, తమ్మారపు బ్రహ్మయ్య, గంగసాని రాఘవరావు, మారుపల్లి ప్రేమ్ కుమార్, భూక్యా సైదా నాయక్, మరీదు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన డీఏవో



వరి పొలాన్ని పరిశీలిస్తున్న డీఏవో

వైరా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి భారీ ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య మంగళవారం పరిశీలించారు. వైరా మండలంలోని గొల్లపూడి, రెబ్బవరం, పూసలపాడు, సిరిపురం తదితర గ్రామాల్లో డీఏవో పుల్లయ్య పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈదురు గాలులకు పడిపోయిన వరిపొలాలను పరిశీలించారు. నేలరాలిన వరి ధాన్యాన్ని కూడా చూశారు. మండలంలో దాదాపు 600ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలో నిర్ధారించారు. మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజూఖాన్, ఏఈవోలు వాసంతి, సైదులు, వెంకటనర్సయ్య, రాజేష్, దీప్తి, పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు కడియాల సతీష్, గొల్లపూడి మాజీ సర్పంచ్ మేడూరి రామారావు పాల్గొన్నారు.

బీజేపీ 'గావ్ చలో బస్తీ చలో'

ఎర్రుపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో బీజేపీ గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ తాండ్ర వినోదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో బీజేపీ జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

మండలంలో భీమవరం గ్రామంలో ఆదివారం కురిసిన అకాలవర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను బీజేపీ నాయకులు పరిశీలించారు. తెలంగాణలో కేంద్ర అమలుచేస్తున్న ప్రధాన మంత్రి పంటల బీమా యోజన పథకాన్ని వినియోగించుకోకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గల్లా సత్యనారాయణ, మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, ఉపాధ్యక్షుడు వేణగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, మండల అధ్యక్షుడు నూతక్కి నరసింహారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

వైరా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వైరా అగ్నిమాపక కేంద్ర సిబ్బంది అగ్నిప్రమాదాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. స్థానిక వంట గ్యాస్ సిలీండర్ గోడౌన్ వద్ద ఏజన్సీ యాజమాన్యం, వినియోగదారులకు ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా జరిగే అగ్ని ప్రమాదాలు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. వైరా అగ్నిమాపక కేంద్రం అధికారి అమరనేని శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి: సత్తుపల్లిలో అగ్నిమాపక వారోత్సవాలు మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా నీటితో ప్రదర్శన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మి, అగ్నిమాపక దళం అధికారి వై.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మధిరటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, ఖమ్మం లోక్‌సభకు బీజేపీ నుంచి పోటీ చేసిన తాండ్ర వినోద్ రావు అన్నారు. మంగళవారం మధిరలో జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతు బీజేపీ ని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు గ్రామ్ చలో, బస్తీ చలో కార్యక్రమాన్ని తీసుకోవటం జరిగిందని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాగా దేశాన్ని ముందుకు తీసుకు పోతున్నాడని అన్నారు, గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేంద్రానికి సహకరించక పోవడం వల్ల కేంద్ర పథకాలు రాష్ట్ర ప్రజలకు అందకుండా పోతున్నాయని అన్నారు. తెలంగాణ సమగ్ర అబివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ రావాలని అప్పుడే ప్రజలకు నిజమైన మేలు జరుగుతుందన్నారు. మధిరలో రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ మంజూరు కాకపోవడానికి స్థానిక ఎమ్మెల్యే భట్టి విక్రమార్కనే కారణమని, రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపిస్తే 48 గంటల్లో మంజూరు చేయించే బాధ్యతను బీజేపీ తీసుకుంటుదని అన్నారు. ఉప ముఖ్యమంత్రి అయ్యి ఉండి భట్టీ ఈ నిర్ణయం తీసుకోక పోవడానికి ఏ శక్తులు అయన్ని అడ్డుకుంటున్నాయో తెలవటం లేదని అన్నారు. అనేక పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, పట్టణ, రూరల్ అధ్యక్షులు శివరాజు సుమంత్, గుండా పాపిరెడ్డి, నాయకులు కుంచం కృష్ణారావు, చిలివేరు సాంబ, పాపట్ల రమేష్, గడ్డం శ్రీహరి, రామిశెట్టి నాగేశ్వరరావు, వేణు, శ్రీను, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో నష్టపోయిన రైతులు

వైరా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటును ప్రకటించి ప్రారంభం చేయకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. రైతు సంఘం ఆధ్వర్యం లో మంగళవారం మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో మొక్కజొన్న రాశులను పరిశీలించి నిరసన తెలిపారు. రైతుసంఘం నాయకులు శ్రీనివాసరావు, బాణాల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రాజా, ఆళ్ల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, పట్టణానికి చెందిన హసావత్ కిరణ్మయి ఇటీవల మృతిచెందగా ఆమె కుటుంబానికి రూ.6లక్షల చెక్కును యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అందజేశారు. మంగళవారం స్థానిక యూటీఎఫ్ భవనంలో మృతురాలి భర్త రాంబాబుకు చెక్కును అందజేశారు.

భూములు కోల్పోయిన వారికి పారితోషికం



మాట్లాడుతున్న రాజేశ్వరి

కారేపల్లి ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ నుంచి వయా కారేపల్లి ద్వారా భద్రాద్రి కొత్తగూడెం వరకు వెళుతున్న రెండో రైలు మార్గంలో భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నుంచి తగినపారితోషకం లభించేలా చూస్తానని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభలో రాజేశ్వరి మాట్లాడుతూ కమలాపురం, గేటు కారేపల్లి, మండల కేంద్రమైన సింగరేణి గ్రామ పంచాయతీలలో రెండవ రైల్వేలైన్లలో 12ఎకరాలవరకు రైతులు తమ భూములు కోల్పోతున్నారన్నారు. వారికి సంబంధించిన భూములను రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇప్పటికే సర్వేచేసిన్నట్లు తెలిపారు. రైతుల నుంచి సేకరించిన పూర్తి సమాచారాన్ని జిల్లా కలెక్టర్‌కు అప్పగించి, రైతులకు సంబంధించిన పారితోషకంపై సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడి నగదు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వే ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది వినీల, మౌనిక, స్థానిక ఆర్ఐ నర్సింహారావు, రైల్వే బోర్డు సభ్యుడు తురకనారాయణ, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గురువమ్మతల్లి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కారేపల్లి ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరుపల్లి గ్రామంలో జరుగుతన్న గురువమ్మతల్లి జాతరలో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గురువమ్మతల్లి, సర్వయ్య స్వామితో కల్యాణ తంతును అర్చకులు వైభవంగా జరిపారు. కల్యాణ తంతును తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

తడారుతోంది.. సాగునీరు ఇవ్వండి..

25 వరకైనా సాగునీరు ఇవ్వండి

కొణిజర్ల రైతుల వేడుకోలు



రాపల్లె మేజర్ కాల్వ

కొణిజర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నీళ్లు బంద్ కావడంతో యాసంగిసాగు చేసిన వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 25 వరకైనా నీళ్లు ఇచ్చి చివరి దశకు వచ్చిన పంటను కాపాడాలని వేడుకుంటున్నారు. మండలంలోని బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని వైరా, రాపల్లె మేజర్‌ల కింద యాసంగి పంటగా రైతులు 6200 ఎకరాలలో వరిని సాగు చేశారు. దానిలో కొంతమంది రైతులు ముందుగా పంటను వేయడంతో వారి పంట చేతికొచ్చింది. జనవరి చివరిలో సాగు చేసిన రైతుల్లో మూడు వేల ఎకరాల రైతులు దీనస్థితిలో ఉన్నారు. పంట పొట్టదశ నుంచి కంకులు వచ్చి గింజలు పాలు పోసుకుంటున్నాయి. ఈ సమయంలో పంటకు తప్పకుండా నీళ్లు ఉండాలని, లేనిఎడల పంటను ఆశలు వదులుకోవలసి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. వారబందీ పేరుతో చాలా నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. ఒకటి, రెండు తడులకు నీళ్లు ఇస్తే పంటను కాపాడుకోవచ్చని, అధికారులు స్పందించి సాగర్‌నీళ్లు విడుదల చేయాలని కోరుతున్నారు. కళ్లముందు పంట ఎండిపోతే చూడలేమని దిగాలు చెందుతున్నారు. తమంతా సాగర్ నీళ్లపైనే ఆధారపడి ఉన్నామని, తమ బాధలను అర్థం చేసుకొని ఉన్నతాధికారులు, ప్రభుత్వ నేతలు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల్లో కూడా నీళ్లు వస్తాయని చెప్పలేకపోతున్నారు. సాగర్ డ్యామ్ వద్దనే నీళ్లు నిలిపివేయడంతో ఎడమకాల్వకు నీరు పూర్తిగా నిలిచిపోయింది. పది రోజులైన నీళ్లు వస్తేనే వరి చేతికివస్తుందని రైతులు తెలుపుతున్నారు. సాగునీరు ఇచ్చి పంటను కాపాడాలని కోరుతున్నారు. పంట చేతికందే సమయంలో నీరు అందకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. మండలంతో పాటు జిల్లా వ్యాపితంగా కూడా సమస్య ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. ఒకతడికి నీరు వస్తే చాలా వరకు పంటకు నష్టం జరగదని అధికారులు అంటున్నారు.